# నమస్తే తెలంగాణ
## ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శుక్రవారం 24 జనవరి 2025 | ADILABAD NIRMAL




లింబా(కే)లో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

## ఆరు గ్యారెంటీలు ఎక్కడ?

కుంటాల, జనవరి 23 : నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని లింబా(కే)లో ఎంపిక చేసిన పథకాల జాబితాల్లో తమ పేర్లు లేకపోవడంతో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. సర్కారు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలు దక్కుతాయో లేదోనన్న ఆందోళనతో జనం రచ్చ చేశారు. అధికారులు సమాధానం ఇవ్వలేక అర్ధాంతరంగా జారుకున్నారు. పోలీసులు భద్రత కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏజాజ్ ఖాన్, ఎంపీడీవో లింబాద్రి, డీటీ నరేశ్ గౌడ్, ఎంపవో విక్రమ్, ఎంపీవో రహీం పాల్గొన్నారు.

## రైతు భరోసాపై రభస

బోథ్, జనవరి 23 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని ధన్నూర్(బీ) గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో రైతు భరోసాపై రభస జరిగింది. యాసంగి పంటలు వేసి రెండు నెలలు గడుస్తున్నా పంటల నమోదు ప్రక్రియ చేపట్టలేదని, రైతుభరోసా ఎలా ఇస్తారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి అధికారులను నిలదీశాడు. కాంగ్రెస్ నాయకులు కల్పించుకోవడంతో గందరగోళ పరిస్థితి నెలకున్నది. సీఐ వెంకటేశ్వర్‌రావ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, శిక్షణ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి కల్పించుకుని ఇరు పార్టీల నాయకులతోపాటు గ్రామస్తులను సముదాయించారు. ఈ సమావేశంలో ప్రత్యేకాధికారి వాజిద్ అలీ, ఎంపీడీవో రమేశ్, ఇంద్రారెడ్డి, శ్రీనివాస్, ఏఈవో సంతోష్, ప్రత్యేకాధికారి శ్రీకాంత్ రెడ్డి, పంచాయ కార్యదర్శి శిరీషా పాల్గొన్నారు.



బోథ్: ప్రజలను కూర్చొబెడుతున్న పోలీసులు



బేల గ్రామసభలో అధికారులను నిలదీస్తుండగా లబ్ధిదారులను సముదాయిస్తున్న పోలీసులు



అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

## 'ఉపాధి' పనులకు వెళ్లకుంటే.. ఆత్మీయ భరోసా ఇవ్వరా?

బేల, జనవరి 23 : ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో అధికారులు చదివిన లబ్ధిదారుల పేర్లలో అవకతవకలు జరగడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు చేసే కూలీలు కులవృతులు చేస్తున్న వారు ఉపాధి హామీ పనికి వెళ్లకుంటే ఆత్మీయ భరోసా ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్లకున్నా.. వారి పేర్లు ఆత్మీయ భరోసాలో ఎలా వచ్చాయని, అసలు పనికి వెళ్లిన వారి పేర్లు ఎందుకు రాలేదని అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, ఎంపీడీవో మహేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభల్లో..

డే-3

# రచ్చ రచ్చ

## ఇందిరమ్మ ఇండ్లు ఎందరికీ ఇస్తరో చెప్పాలి..



భీంపూర్, జనవరి 23 : భీంపూర్ మండలంలో నిర్వహించిన గ్రామసభలో ఎందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తరో చెప్పాలని ప్రజలు అధికారులను ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి, డీఎస్పీ జీవన్‌రెడ్డిలు అక్కడికి చేరుకుని వారు చెప్పిన సమస్యలు విని సముదాయించారు.

అదనపు కలెక్టర్‌తో గోడు చెప్పుకుంటున్న స్థానికులు

## గ్రామసభ బహిష్కరణ

కుభీర్, జనవరి 23 : కుభీర్ మేజర్ గ్రామ పంచాయతీలో జరగాల్సిన గ్రామసభను గ్రామస్తులు బహిష్కరించారు. రేషన్‌కార్డులు, ఆత్మీయ రైతుభరోసాలో కేవలం 20 శాతం లబ్ధిదారులను ఎంపిక చేయడం, మిగతా దరఖాస్తు చేసుకున్న 80 శాతం పేదలకు ప్రభుత్వం మొండిచేయి చూపించడంపై ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీవోలతో గ్రామస్తులు వాదనకు దిగారు. ముందుగా సర్వే చేసిన వారిని తీసుకొచ్చి ఆ తర్వాత గ్రామసభ నిర్వహించాలని మండి పడ్డారు. కార్యాలయం ఎదుట బైఠాయించి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అధికారులు ఎంత చెప్పినా వినకుండా ఇదేమీ రాజ్యం ఇదేమీ రాజ్యం దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడకు చేరుకున్న భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్‌ను చుట్టూ ముట్టి రూ.2 లక్షల రుణమాఫీ చేశారా అని నిలదీశారు.



అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

## మూడోరోజు అవే నిరసనలు.. ఆందోళనలు..

- ఎక్కడికక్కడ అధికారులను నిలదీసిన జనం
- అనర్హులను ఎంపిక చేశారంటూ మండిపాటు
- ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపికపై గందరగోళం

మంచిర్యాల, జనవరి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పేరిట కాంగ్రెస్ సర్కారు నిర్వహిస్తున్న గ్రామసభలు రచ్చ రచ్చగా మారాయి. పథకాల ఎగవేతపై జనం అధికారులను నిలదీస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన పేదలకు చోటు కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా పథకాల్లో చోటు దక్కకపోవడంపై గుండెమండిన సామాన్యులు తిరగబడుతున్నారు. అనర్హులను జాబితాలో చేర్చడంపై ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. మూడోరోజైన గురువారం కూడా గ్రామసభలు నిలదీతలు, నిరసనలు మధ్య సాగాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గ్రామసభల్లో ఎక్కడ చూసినా ఈ దృశ్యాలే కనిపించాయి.

## ప్రొటోకాల్ రగడ

తాంసి, జనవరి 23 : పొన్నారి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన సభలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఫొటో లేదని బీఆర్ఎస్ నాయకులు వెంకటరమణ, అశోక్, ఆనంద్, ముచ్చ రేఖ రఘు, లక్ష్మీపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజాపాలన కాదని కాంగ్రెస్ పాలన అంటూ నిరసన వ్యక్తం చేశారు. అర్హులైన పేదల పేర్లు జాబితాలు ప్రచురించలేదని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. గ్రామంలో పది మంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యుల పేర్లు వచ్చాయని మండిపడ్డారు. ప్రొటోకాల్ రగడ నేపథ్యంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎస్సై రాధికతో కలిసి గ్రామసభను పరిశీలించారు.



ఫ్లెక్సీలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఫొటో లేదని అభ్యంతరం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఎన్నిసార్లు దరఖాస్తులు ఇయ్యాలే..



*లోకేశ్వరం, జనవరి 23 : ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చాం. సర్వేకు వచ్చిన అధికారులకు వివరాలు అందజేశాం. మళ్లీ ఇవాళ గ్రామసభ అంటూ దరఖాస్తు ఇవ్వాలని అధికారులు అడుగుతున్నారు. ఇలా ఎన్నిసార్లు దరఖాస్తులు ఇవ్వాలి. ఎప్పటికీ మాకు న్యాయం జరుగుతుంది. ఈ దరఖాస్తులు కేవలం నచ్చజెప్పడానికే తప్పా లేక మాకేమైనా న్యాయం జరుగుతుందా.. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో మా పేర్లు లేవు. అలాగే ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదు. రైతు భరోసా అందలేదు.*

**- గుస్కుల సందీప్, రైతు, రాయపూర్ కాండ్లి**

## మాకేందుకు రేషన్ కార్డు రాలే?

ముథోల్, జనవరి 23 : నిర్మల్ జిల్లా ముథోల్ మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో మేము అర్హులమే అయినా రేషన్‌కార్డు ఎందుకు రాలేదని అధికారులను ప్రశ్నించారు. దీంతో కొద్దిసేపు గందరగోళం నెలకున్నది. ఇందిరమ్మ ఇండ్ల అర్హుల పేర్లు చదివి సభను ముగించారు. దీంతో గ్రామస్తులు పూర్తి గ్రామసభ కాకుండానే ముగించడం ఏంటని తీవ్ర నిరాశకు గురయ్యారు.



అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

## ఆత్మీయ భరోసాకు అర్హులం కాదా?

గుడిహత్నూర్, జనవరి 23 : 'మేము వ్యవసాయ కూలీలం. పనికి వెళ్లంది పొట్ట గడవదు. మేం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులం కాదా? మా పేరు జాబితాలో ఎందుకు లేదు.' అని కొల్హారిలో నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఈజీఎస్‌లో పని చేయకుంటే అర్హులం కాదా? ఇంటి వద్ద కూర్చొని సర్వేలు చేశారని ఆరోపించారు. ఒకే వర్గానికి చెందిన వారినే ఎంపిక చేశారని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తగరే ప్రకాశ్, గజానంద్, గిత్తెలు ఆరోపించారు.



కొల్హారి గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు ←

## సర్పంచ్ ఎన్నికల కోసమేనా..

నేరడిగొండ, జనవరి 23 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని తేజాపూర్, నేరడిగొండ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో అర్హుల జాబితాలో తమ పేర్లు రాకపోవడంతో ప్రజలు సర్పంచ్ ఎన్నికల కోసమే సభలు నిర్వహిస్తున్నారా? అని అధికారులను నిలదీశారు. తేజాపూర్‌లో 20 శాతం మందికి మాత్రమే రుణమాఫీ అయిందని.. మిగతా 80 శాతం మందికి కాలేదని రైతులు ఆందోళన చేశారు.



నేరడిగొండలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

# రైతు అధ్యయన కమిటీ రాక

## నేడు ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్న సభ్యులు

- రైతు కుటుంబలకు పరామర్శ
- యాపల్‌గూడలో సమావేశం

ఆదిలాబాద్, జనవరి 23(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ నేడు(శుక్రవారం) పర్యటించనుంది. వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన కమిటీ ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో పలు అంశాలపై చర్చించనుంది. 13 నెలల కాలంలో వివిధ సమస్యలతో 33 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పంటలు సరిగా పండకపోవడం, బ్యాంకులు, ప్రైవేటు అప్పులు, దళారుల వద్ద తీసుకున్న బాకీలు తీరకపోవడం వంటి ఆర్థిక సమస్యతోపాటు సాగులో నష్టాలు ఇతర సమస్యలు రైతుల పాలిట శాపంగా మారాయి. ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి సౌకర్యం తక్కువగా ఉండడంతో వానకాలం పంటలు మాత్రమే వేస్తారు. రైతు భరోసా పథకం రాకపోవడంతో పెట్టుబడుల కోసం అన్నదాతలు అప్పులు చేయాల్సి వస్తుంది. దీంతో ఆర్థిక సమస్యలు రైతులను వెంటాడుతున్నాయి. రూ.2 లక్షల రుణమాఫీ కోసం వేలాది మంది రైతులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో అధికంగా రైతులు సాగు చేసే పత్తి పంట కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థ (సీసీఐ) నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 ఉండగా.. నాణ్యత సాకుతో రూ.100 తగ్గించి రూ.7,421తో కొనుగోలు చేస్తుంది. ఇలా పలు కారణాలతో రైతులు ఇబ్బంది పడి బలవన్మరణాలకు పాల్పడాల్సి వస్తుంది.

### క్షేత్రస్థాయి పర్యటన

రైతు ఆత్మహత్యలపై అధ్యయనం చేయడానికి జిల్లా పర్యటనకు వస్తున్న కమిటీ క్షేత్రస్థాయి పర్యటన జరపనుంది. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆదిలాబాద్ పట్టణంలోని కిసాన్‌చౌక్‌లో రైతు విగ్రహానికి పూలమాల వేస్తారు. అనంతరం ఇటీవల జిల్లా కేంద్రంలోని ఐసీఐసీఐ బ్యాంకులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న బేల మండలంలోని రేణిగూడలోని రైతు దేవ్‌రావు కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబసభ్యులతో మాట్లాడుతారు. అనంతరం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రామాయిలో మిర్చి పంట సాగు చేస్తున్న రైతులతో మాట్లాడి సాగులో సమస్యలు, ఇతర విషయాల గురించి తెలుసుకుంటారు. తర్వాత యాపల్‌గూడలో రైతులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చిస్తారు. రైతు కమిటీ సభ్యులకు తమ సమస్యల గురించి తెలియ జేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. తమ పర్యటనలో రైతుల సమస్యలను పూర్తిగా తెలుసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని కమిటీ సభ్యుడు మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు.

# గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

బజార్‌హత్నూర్, జనవరి 23 : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామ పంచాయతీల్లో అధికారులు నిర్వహిస్తున్న గ్రామసభలను అర్హులైన ప్రతి ఒక్క కుటుంబం సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కలెక్టర్ రాజార్షి షా సూచించారు. ప్రజాపాలన మూడో రోజు గ్రామసభల సందర్భంగా గురువారం మండలంలోని జాతర్ల గ్రామంలో ఆయన పాల్గొని లబ్ధిదారులు అందిస్తున్న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో కలెక్టర్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల కోసం అర్హులైన లబ్ధిదారులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. గ్రామ, మండల, జిల్లా కేంద్రాల్లో దరఖాస్తుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఉంటాయన్నారు. కలెక్టర్ పిప్పిరి గ్రామస్తులతో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిప్పిరి గ్రామానికి ఇచ్చిన హామీలను అమలు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మోహన్ సింగ్, తహసీల్దార్ శంకర్, మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ సౌద్, గ్రామ పటేల్, పిప్పిరి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గోవర్ధన్, మురళీమోహన్ పాల్గొన్నారు.